అంగన్‌వాడీలకు యాప్‌సోపాలు

- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు ఆపసోపాలు
- లబ్ధిదారుల ముఖ గుర్తింపునకు అంగన్‌వాడీ కార్యకర్తల ముప్పతిప్పలు
- సరిగ్గా పని చేయని బాలసంజీవని, పోషణ ట్రేకర్ యాప్‌లు


యాప్ ద్వారా ముఖ చిత్ర గుర్తింపు

మద్దిలపాలెం : అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో ఆపసోపాలు పడుతున్నారు. ముఖ చిత్ర గుర్తింపునకు పడరానిపాట్లు పడుతున్నారు. యాప్‌లు పనిచేయక వాటితో కుస్తీలు పడుతున్నారు. ఈ బాధలు పడలేని అంగన్‌వాడీ కార్యకర్తలు మనస్తాపానికి గురై యాప్‌లను తగ్గించాలంటూ ఆందోళన చేపడుతున్నారు. ఇటీవలే ఎంవీపీ కాలనీలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖ చిత్ర గుర్తింపు చేయాల్సిందే. అలా చేయకుండా ఆహార పదార్థాలను అందించలేరు. యాప్‌లు సరిగ్గా పనిచేయక పోవడంతో సకాలంలో ముఖ చిత్ర గుర్తింపు ప్రక్రియ జరగకపోవడంతో ఇటు లబ్ధిదారులు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలని ఆందోళన

ప్రభుత్వం తక్షణమే స్పందించి తమపై యాప్‌ల భారం తగ్గించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఇదే విషయమై ఇటీవల ఎంవీపీ కాలనీలో గల మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. క్షేత్ర స్థాయిలో ఏ కార్యక్రమాలను ప్రభుత్వం తలపెట్టినా మొదటిగా అంగన్‌వాడీ కార్యకర్తలను భాగస్వాములను చేస్తుండడంతో పని ఒత్తిడి పెరిగిపోతోందని వాపోయారు. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టి ఆరేళ్లు వచ్చే వరకు కార్యకర్తలే నిత్యం పర్యవేక్షించాల్సి వస్తోందని... తల్లికి, బిడ్డకు పోషణతోపాటు బిడ్డలకు టీకాలు, వారి ఆరోగ్య కార్డులు తదితర


ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ రూన్సీరాణికి వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు (ఫైల్)

వివరాలను నిత్యం అంగన్‌వాడీ కార్యకర్తలే యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. తమపై యాప్‌ల భారం తగ్గించాని కోరుతూ పీడీకి వినతిపత్రం అందించారు.

సక్రమంగా సాగని పోషకాహార పంపిణీ

లబ్ధిదారులకు పోషణ ట్రేకర్, బాల సంజీవని అందించాలంటే రెండు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారు ఫేస్ రికగ్నైజ్ చేసి యాప్‌లో నమోదు చేయాలి. అయితే ఇక్కడే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ గుర్తింపు చాలాసార్లు సక్సెస్ కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ప్రభుత్వం బాలసంజీవని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపుతో బియ్యం ఇస్తోంది. ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రేకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరకులు ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు ఈ రెండు యాప్‌లను వినియోగించాల్సి వస్తోంది. ఇది కష్టంగా ఉందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతోపాటు 6 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు వయసున్న బాలలకు ప్రతి నెల పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహారం ఇచ్చేవారు. అయితే ఎక్కువ మంది తమకు ఇంటి వద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్)గా మార్చారు. పాలు, కోడి గుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. ఇవన్నీ పంపిణీ చేయాలంటే వారందరి పూర్తి వివరాలను పోషణ యాప్ ద్వారా రెండు సార్లు నమోదు చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. అదేవిధంగా టీహెచ్‌ఆర్ కోసం ఒకే లబ్ధిదారును రెండు సార్లు ముఖ యాప్ ద్వారా గుర్తించాల్సి రావడం కూడా ఇబ్బందికరంగా మారిందంటున్నారు. నెలలో ఎక్కువ సమయం ఈ పనికే వినియోగించడం వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో సరకుల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బందులు

పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ కష్టాలు అధికంగా ఉండడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్స్ ర్యామ్ తక్కువగా ఉండటంతో తక్షణమే యాప్ స్పందించక తిప్పలు తప్పడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు యాప్‌లు సరిగ్గా పనిచేయక తామూ ఇబ్బంది పడుతున్నామని గర్భిణులు, బాలింతలు సైతం వాపోతున్నారు.

ప్రాథమిక విద్యా బోధనకు ఆటంకం

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల చిన్నారులకు ప్రాథమిక విద్య బోధించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్.సి.ఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్ఎన్ఎన్), ప్రీ స్కూల్ అడ్మిన్ విద్యార్థుల వివరాలు ప్రతి నిత్యం విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వాటితోపాటు పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రిజిస్టర్, విటమిన్ – ఎ రికార్డు, రిఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. వీటితోపాటు నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హౌస్ హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టులతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి టేక్ హోమ్ రేషన్ పంపిణీ రికార్డు, స్టాఫ్ అడ్మిషన్ రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇంత పని ఒత్తిడి వల్ల పిల్లలకు ప్రాథమిక విద్య బోధించేందుకు సమయం సరిపోవడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.



పోషణ ట్రేకర్ యాప్

రేషన్ కోల్పోతున్నాం..



ముఖ గుర్తింపు పోషణ యాప్ ద్వారా 15 సార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఒకసారి సక్సెస్ అని వచ్చినా రెండో సారి మ్యాచ్ కావడం లేదు. దీని వల్ల నేను రేషన్ కోల్పోతున్నాను. ప్రభుత్వం స్పందించి యాప్ కష్టాల నుంచి తప్పించి, సులభతరంగా రేషన్ సరకులు అందించే ఏర్పాట్లు చేయాలి.

– సీహెచ్.అనూష, పిల్లల తల్లి

క్లుప్తంగా

విమ్స్‌కు వెంటిలేటర్ వితరణ


విమ్స్ డైరెక్టర్‌కు వెంటిలేటర్ అందజేస్తున్న ఇండస్ ఆస్పత్రి ప్రతినిధులు

ఆరిలోవ : నగరంలోని ప్రముఖ ఆస్పత్రి ఇండస్ యాజమాన్యం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు వెంటిలేటర్ అందించింది. ఇండస్ ఎండీ డాక్టర్ శ్రీధర్ బుధవారం సిబ్బందితో కలిసి విమ్స్‌ను సందర్శించారు. అక్కడ విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుకు ఆయన చేతుల మీదుగా వెంటిలేటర్‌ను అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఇండస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రోగులకు అత్యవసర సమయంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇండస్ సీఈవో చంద్రమౌళి, జీఎం ఆపరేషన్స్ సుధీర్, విమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.1.5 లక్షల విరాళం


ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులకు బాండ్ అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని సిరిపురానికి చెందిన ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ రూ.1.5 లక్షల విరాళం అందజేసింది. సింహగిరికి వచ్చిన క్లబ్ ప్రతినిధులు విరాళాన్ని నగదు రూపంలో పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. వారికి దేవస్థానం తరపున ఏఈవో తిరుమలేశ్వరరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు.

మొల్లి అప్పారావుకు ఆత్మీయ సత్కారం


వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావును సత్కరిస్తున్న నాయకులు

మద్దిలపాలెం : వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావుని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు బుధవారం సీతమ్మధారలోని కార్యాలయంలో కలిసి సత్కరించారు. సీనియర్ నాయకులు నల్ల రవి, విశాఖ జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, తూర్పు నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు శిరీష, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షురాలు పీలా జోషీల, 15వ వార్డు మహిళ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, 10వ వార్డు మహిళ అధ్యక్షురాలు వరలక్ష్మి కలిశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఎంవీపీ కాలనీ : తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్ – 1, సెక్టార్ – 2, కొత్త వెంకోజీపాలెం, కరాచీ బేకరీ, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీలోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు దరి బి.ఎస్.ఆర్.నగర్‌లో కుటుంబంతో నివసిస్తున్న మామిడి గంగరాజు(36) ఆటో నడుపుతుండేవాడు. అతని భార్య జానకి మంగళవారం తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. ఆమె సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త గంగరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. దీంతో ఆమె భయంతో ఇరుగు పొరుగు వారిని పిలిచి వారి సహాయంతో భర్తను కిందకి దించి వెంటనే విమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు అప్పటికే గంగరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో జానకి ఇచ్చిన ఫిర్యాదుతో ఆరిలోవ పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం


ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ వెనుక నిలిచిపోయిన సామాజిక భవనం నిర్మాణం


సామాజిక భవనం లోపలి భాగం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.80 లక్షలతో పనులు ప్రారంభం
- కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పనులు ఆపేసిన అధికారులు

ఆరిలోవ : జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి పాత పోలీస్ స్టేషన్ వెనుక నిర్మాణంలో ఉన్న సామాజిక భవనం పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. సామాజిక అవసరాల కోసం స్థానికులకు ఉపయోగపడేలా ఇక్కడ సామాజిక భవనం నిర్మించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ అధికారులు సుమారు రూ.80 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో అధికారులు చకచకా పనులు జరిపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీని నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. సుమారు ఏడాదిగా పనులు జరపకుండా అధికారులు వదిలేశారు. సుమారు 250 చదరపు గజాల విస్తర్ణంలో నిర్మాణం తలపెట్టారు. ఇందులో భాగంగా శ్లాబు, గోడలు నిర్మించి తలుపులు అమర్చారు. ఇంకా కిటికీలు, వాటికి తలుపులు అమర్చాల్సి ఉంది. దీంతోపాటు ఫ్లోరింగ్, కరెంట్ వైరింగ్ తదితర పనులు మిగిలి ఉన్నాయి. ఇంతలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మిగిలిన పనులు జరపకుండా అధికారులు వదిలేశారు. దీంతో సగం పనులకే పరిమితమైన ఈ భవన నిర్మాణం దిష్టిబొమ్మగా మిగిలిపోయింది. ఈ భవనం నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తే నెహ్రూనగర్, లీలాసుందరినగర్, దుర్గానగర్, రాజీవ్ నగర్, కనకదుర్గానగర్, న్యూ అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతవాసుల అవసరాలకు ఉపయోగపడుతుందని స్థానికులు అంటున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి చేయించాలని ఆయా కాలనీల వాసులు అధికారులను కోరుతున్నారు.

కాలువ మరమ్మతులు పూర్తి


జీవీఎంసీ అధికారులకు సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులోని విశాఖ ఐ హాస్పిటల్ డౌన్ చిన్నారావు షాప్ దగ్గర కాలువ మరమ్మతులు శరవేగంగా పూర్తి చేశారు. వర్షపు నీరు, మురుగు రోడ్డు మీద నిలిచిపోతున్నాయని స్థానికులు 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మికి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై కార్పొరేటర్ తక్షణమే స్పందించి జీవీఎంసీ అధికారులకు తెలియజేశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, ఏఈ అప్పలనాయుడు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో పరిశీలించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో 20వ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, మధు మంగరాజు, దుంప పోల్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేరుచేసి అందించాలి


జోడుగుళ్లపాలెంలో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ

ఆరిలోవ : జీవీఎంసీ జోన్ – 2 తొమ్మిదో వార్డు పరిధి జోడుగుళ్లపాలెంలో పారిశుధ్య సిబ్బంది స్థానికులకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై బుధవారం అవగాహన కల్పించారు. సిబ్బంది వీధుల్లోకి వెళ్లి తడి, పొడి చెత్తతోపాటు ప్రమాదకరమైన వాటిని వేరే చేసే విధానాన్ని స్థానికులకు వివరించారు. ఇళ్లలో చెత్తను మూడు వేర్వేరు డబ్బాలలో వేయాలని, వాటిని రోజూ ఇంటి ముందుకు వస్తున్న పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. రోడ్లపై చెత్త వేయకూడదని సూచించారు. దీనివల్ల ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఇందులో భాగంగా కుళాయిల నీటిని కూడా నీటి సరఫరా విభాగం సిబ్బంది పరీక్షించారు. కుళాయిల ద్వారా సరఫరా జరిగిన నీరు ఎంత శాతం శుద్ధి జరిగిందో, క్లోరినేషన్ ఎంత ఉందో స్థానికులు వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, సచివాలయం శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలివ్వాలి

మధురవాడ: మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న హింస, దాడులు, వేధింపుల నుంచి రక్షించుకునేందుకు ఉద్యమించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కొమ్మాది జంక్షన్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన ఐద్వా మద్దిలపాలెం జోన్ 5వ మహాసభల్లో వారు మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని తుంగలోకి తొక్కిందన్నారు. మహిళల రక్షణే తమ ధ్యేయం అని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను నేరస్తులకు చుట్టాలుగానే మార్చేస్తున్నాయన్నారు. గ్రామిక మహిళలపై పనిభారం పెంచడంతోపాటు, రాత్రి సమయాల్లో కూడా మహిళలు పనులు చేయాలని ప్రభుత్వాలే నిర్ణయాలు చేస్తే మహిళలకు రక్షణ, స్వేచ్ఛ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. విద్యుత్, గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతి సందర్భంగా ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం కమిటీలను కలిపి మద్దిలపాలెం జోన్‌గా ఏర్పాటు చేసి, నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బి.భారతి, కార్యదర్శిగా కొండమ్మ, కోశాధికారిగా వి.శాంతి, ఉపాధ్యక్షులుగా కె.కుమారి, ఎస్.గౌరి, సహాయ కార్యదర్శులుగా కె. సుజాత, ఎం.మౌనికను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలి

- ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు ఇల్లు, వెలగపూడి కార్యాలయం వద్ద నిరసన



గంటా శ్రీనివాసరావు ఇంటి ముందు నిరసన తెలుపుతున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు

ఎంవీపీ కాలనీ : టిడ్కో గృహాల మంజూరులో భాగంగా ఇచ్చిన బ్యాంకు రుణాలు తక్షణమే రద్దు చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటి ముందు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సమస్య పరిష్కారానికి వినతి పత్రాలు అందజేశారు. దబ్బంద టిడ్కో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాలు రద్దు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీధిలైట్లు, తాగునీరు, ఆట స్థలం, ఆస్పత్రి వంటివి ప్రభుత్వం అలాట్మెంట్ పత్రాల్లో ఉన్నప్పటికీ అక్కడ నేటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. రుణాల కోసం బ్యాంకులు లబ్ధిదారులను వేధిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమస్యపై అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలు మాటిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఈశ్వరరావు, పి.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, జయశ్రీ, నూకరత్నం, దివ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ


చిన్నారికి స్పీచ్ థెరపీ శిక్షణ ఇస్తున్న థెరపిస్ట్ బాలేశ్వరి

సీతంపేట: కలెక్టర్, విద్యా శాఖాధికారి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆదేశాల మేరకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని భవిత సెంటర్‌లో బుధవారం దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ ఇచ్చారు. నగరంలోని సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, పెందుర్తి, చినగదిలి ఐదు మండలాలకు చెందిన స్పీచ్ ప్రాబ్లం ఉన్న 70 మంది దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు. వీరికి భాష ఉచ్చరణలో అభివృద్ధి సాధించేందుకు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి శిక్షణనిచ్చారు. పిల్లలకు, తల్లిదండ్రులకు స్పీచ్ థెరపీకి సంబంధించి అత్యంత ముఖ్యమైన మెళకువలను తెలియజేశారు. వారంలో రెండు రోజుల చొప్పున ప్రతి మండలానికి ఒక కేంద్రంగా స్పీచ్ థెరపీ అవసరమైన పిల్లలందరికీ జిల్లాలోని అన్ని మండలాలు కవర్ అయ్యేలా శిక్షణ ఇస్తామని బాలేశ్వరి తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్, అదనపు పథక సమన్వయకర్త జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధం


విలేకరులతో మాట్లాడుతున్న మహ్మద్ ఇక్బాల్

ఏయూ క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఏఫియా ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ (ఏఐజీ) చైర్మన్ మహ్మద్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే తాము అమెరికా, యూఎస్ఏ, ఇండియాలో విభిన్న రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సైతం తాము వ్యాపారాన్ని విస్తరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తాము ఇప్పటికే హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్ రంగాల్లో పని చేస్తున్నామని, పరిశ్రమలు, క్రీడలు, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో సైతం పనిచేయడానికి ఆసక్తి కలిగిన భాగస్వామ్యం కోసం చూస్తున్నామన్నారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రానికి వచ్చే సంస్థలను స్వాగతించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంస్థ సభ్యులు ఖాజా అజాముద్దీన్, సోహైల్ ఖాన్, మమ్మద్ ఆలంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్

తాటిచెట్లపాలెం: ఈ నెల 30న అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ మానవ అక్రమ రవాణాను అరికట్టండి అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా కూడా ఒకటని, దీని ద్వారా ఎంతోమంది అమాయకులు బలవుతున్నారన్నారు. వివిధ కారణాల వల్ల దేశంలోని ఆడ, మగపిల్లలు అక్రమ రవాణా చేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అనాగరిగ చర్యకు వ్యతిరేకంగా సమాజంలో ప్రతి ఒక్కరూ సరైన అవగాహన పొంది, ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం ద్వారా దీనిని అరికట్టవచ్చన్నారు.

ఉత్సాహంగా బీసీఏ విద్యార్థుల వీడ్కోలు వేడుక


వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సమత కళాశాల బీసీఏ విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ, పాశ్చాత్య గీతాలకు నృత్యాలు చేస్తూ విద్యార్థులు ఆడిపాడారు. పలువురు విద్యార్థులు చదువు విశిష్టతను, సమాజ ప్రగతిని తెలియజేస్తూ చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతను అభివృద్ధి దిశగా నడిపించేది చదువు ఒక్కటేనన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువత ఉన్నత చదువుతోపాటు నైపుణ్యాలు పెంచుకుని సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.